# “డెబ్బది ఏళ్ల మారులు” (మత్తయి 18:21-35)

> దక్షిణ సముద్రపు దీవుల్లో ఉన్న హుయాహైన్‌కు చెందిన టమాటో అనే రాజు 1818లో క్రైస్తవుడయ్యాడు. ఆ తరువాత వెంటనే, తననూ, క్రైస్తవులుగా మారిన తక్కిన వారినీ పట్టుకొని కాల్చివేయాలనే దుష్ట పన్నాగాన్ని స్థానికులు పన్నినట్టు అతడు కనుగొన్నాడు.
>
> టమాటో కొందరు సైనికులను ఏర్పరచుకొని, ఆ పన్నాగం పన్నిన వారి ఎరుక లేకుండగనే, ముట్టడివేసి, బలత్కారం చేయకుండానే వారిని పట్టుకున్నాడు. పైగా తన భోజనపు బల్లవద్ద వారికి గొప్ప విందు చేశాడు. అదే వారిని క్షమించినట్టు గుర్తు. క్రీస్తు యొక్క క్షమాపణకు అది నిదర్శనం కూడా.
>
> ఎదురు చూడని టమాటో యొక్క కనికరం ఆ అడవి మనుష్యులను (అనాగరికులను) ఆశ్చర్య చకితులనుగా చేసింది. వారు తమ విగ్రహాలను కాల్చివేసి, క్రైస్తవులుగా మారారు. క్షమాపణ కున్న శక్తి అలా భక్తితో కూడిన భయాన్ని పుట్టిస్తుంది.[1]

క్షమాపణ శక్తివంతమయ్యింది! క్షమించే హృదయం కలిగి యుండడం - యేసు తన ప్రజల కొరకు ఏర్పరచిన కార్యక్రమంలో ముఖ్యమయింది. మత్తయి 18లో మాత్రమే దాఖలు చేయబడ్డ “కనికరంలేని దాసుని” ఉపమానంలో ఇది తేటగా చూపబడింది.

## క్షమాపణ బోధింపబడింది (మత్తయి 18:21-22)

ఒక సందర్భంలో పేతురు యేసు నొద్దకు వచ్చి, “- ప్రభువా, నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసిన యెడల నేనెన్ని మారులు అతని క్షమింపవలెను? ఏడు మారుల మట్టుకా? అని” అడిగాడు (21వ.). పేతురు “ఏడు” అనే సంఖ్య ఎందుకు ఉపయోగించాడో మనకు సరిగా తెలియదు. మూడు మారుల మట్టుకు క్షమించాలని రబ్బీలు బోధించారు.[2] ఒకవేళ పేతురు వారి సంఖ్యను పెంచ నుద్దేశించాడేమో! ఏడు సంపూర్ణతను సూచిస్తుంది గనుక పేతురు ఆ ఉద్దేశంతో దాన్ని ఉపయోగించి యుండవచ్చు. ఒకసారి యేసు క్షమాపణ మీద ఉపయోగించిన సంఖ్యను గుర్తు చేసికొని పేతురు ఉపయోగించి యుండవచ్చు. “అతడు ఒక దినమున ఏడు మారులు నీ యెడల తప్పిదము చేసి యేడు మారులు నీవైపు తిరిగి - మారుమనస్సు పొందితిననిన యెడల అతని క్షమింపవలెను” అని యేసు బోధించారు (లూకా 17:4).

“అందుకు యేసు అతనితో ఇట్లనెను - ఏడు మారులు మట్టుకే కాదు, డెబ్బది

ఏళ్ల మారుల మట్టుకని నీతో చెప్పుచున్నాను'' (22వ.). మరో విధంగా చెప్పాలంటే, 490 మారుల మట్టుకు![3] క్షమాపణ మీద రెండు ముఖ్యమైన పాఠాలు నేర్పించడానికే యేసు యింత హెచ్చయిన సంఖ్యను ఉపయోగించారు: మొదటిది, మనం క్షమించే స్వభావాన్ని అలవరచుకోవాలి. ఒక వ్యక్తిని 490 సార్లు క్షమించే సరికి, అది మనకు అబ్బిపోతుంది. రెండవది, మనలను బాధించిన దెవరు - ఎంత తరచుగా వాన్ని క్షమించామనే లెక్క వేసికొనడం హాస్యాస్పదంగా ఉంటుంది. ''అతన్ని నేను క్షమించింది యిది పదిహేనవ సారి. ఇంకా 475 సార్లు అతన్ని నేను క్షమించినట్లయితే - యికను క్షమించవలసిన అవసరంలేదు'' అంటూ నోట్ బుక్ మీద మార్కు వేసికొనడమనేది ఎంత నగుబాటుతో కూడిన కార్యమో! ''ప్రేమ అపకారమును రికార్డు చేయదు'' (1కొరింథీ 13:5; NIV).

పేతురు కొక్కడికే యేసు ఈ బోధ చేయలేదు. తన సంఘం కొరకైన ఏర్పాటులో క్షమాపణ ప్రాముఖ్యమైనది. తన అనుచరులకు ఆయన యిలా బోధించారు:

> మనుష్యుల అపరాధములను మీరు క్షమించినయెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయినయెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు (మత్తయి 6:14-15).
>
> తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మును గూర్చి తీర్పు తీర్చబడదు; నేరము మోపకుడి, అప్పుడు మీ మీద నేరము మోపబడదు; క్షమించుడి, అప్పుడు మీరు క్షమింపబడుదురు (లూకా 6:37-38a).

## క్షమాపణ ఉదహరించబడింది (మత్తయి 18:23-35)

''డెబ్బది ఏళ్ల మారుల మట్టుకు'' క్షమించాలని ఆయన పేతురుతో చెప్పిన తరువాత, ఒక ఉపమానాన్ని చెప్పడం ద్వారా యేసు తన బోధను నొక్కి చెప్పారు. అది కనికరము చూపని దాసుడనే ఉపమానం:

> కావున పరలోక రాజ్యము, తన దాసులయొద్ద లెక్క చూచుకొన గోరిన యొక రాజును పోలియున్నది. అతడు లెక్క చూచుకొన మొదలు పెట్టినప్పుడు, అతనికి పదివేల తలాంతులు అచ్చియున్న యొకడు అతని యొద్దకు తేబడెను (మత్తయి 18:23-24).

రాజు దూర ప్రయాణంనుండి తిరిగివచ్చి, తన దాసులను బానిసలను తన యొద్దకు పిలిచాడని మనస్సులో ఒక చిత్రాన్ని పెట్టుకొని ఆలోచించు! అతని సింహాసనం ఎదుట నిలిచి ఒకని వెంట ఒకడు తన గృహనిర్వాహకత్వపు లెక్కలు అప్పగించి వెళ్లు తున్నారనుకో. రాజు యొక్క నమ్మకాన్ని చూరగొని, పెద్ద మొత్తం అప్పగింపబడిన యొకడు తన ప్రభువు ఎదుట నిలిచాడు. మొదట ఆ గృహ నిర్వాహకుడు చిరునగవుతో నిలిచాడు. తన రాజు యొక్క పుస్తకాలు తెచ్చి లెక్క

చూచినప్పుడు, తనకప్పగింపబడిన వాటిలో పదివేల తలాంతులు అతడు అపహరించి, తినివేసినట్టు లెక్కలు తేలగా, అతని ధైర్యం నిరాశగ మారిపోయింది!

''పదివేల తలాంతులం'' టే ఎంతో! నిశ్చితాభిప్రాయం కలిగియుండలేం. ''తలాంతు'' అనేది డబ్బు రూపంలో ఉన్నది కాదు, అది కొంత బరువుగల ప్రశస్తమైన లోహం (లోహం యొక్క విలువ స్థలాన్నిబట్టి మారుతున్నట్టే, తూనిక విధానం కూడా మారుతూవుంటుంది). అందువలన పదివేల తలాంతుల విలువ ఎంతో- ఏకాభిప్రాయంతో సూచింప వల్లపడలేదు. అది ఎంతో గొప్ప మొత్తమై యుండవచ్చు. అయితే మనం ప్రస్తుతానికి దాని విలువ 10,000,000 డాలర్లనుకుందాం. నేటి మార్కెట్టు వెల కట్టితే బహుశా అది చాలా తక్కువే అయ్యుండొచ్చు[4]. (ఒక దాసుడు అంత పెద్ద అప్పులో ఎలా పడతాడు అనే వగైరా వివరాల్లో చిక్కు బడవద్దు); ప్రభువైన యేసు చెప్పే సంగతేమంటే - అతడు కట్ట శక్యం కానంత అప్పులో ఉన్నాడు - అనేదే.

ఆ పదివేల తలాంతులను చెల్లించడానికి వానియొద్ద ఏమీలేనట్టు 25వ వచనం సూచిస్తుంది. ఒక వేళ అతడు జూదే ఆడాడో లేక తప్పుడు పెట్టుబడుల్లోనే దాన్ని పోగొట్టాడో. ఏది ఏమైనా, అదంతా పోయింది, తన యజమానునికి దాన్ని చెల్లించే మార్గం ఏదీలేదు. రాజు ఆ పరిస్థితిని చూచినప్పుడు, ''వానిని, వాని భార్యను, పిల్లలను, వానికి కలిగినది యావత్తును అమ్మి, అప్పు తీర్చవలెనని ఆజ్ఞాపించెను'' (25b వ.). ఆ దినాల్లో యిది సామాన్యంగా జరిగేదే! అప్పు తిరిగి చెల్లించనట్టయితే, ఆ దాసునికి, వాని కుటుంబానికి యావజ్జీవపు శిక్షయే.

ఎప్పుడైతే రాజు తనకు శిక్షావిధిని సూచించాడో, ఆ దాసుడు తన యజమానుని కాళ్లముందు పడి దోగాడుతూ, ''- నాయెడల ఓర్చుకొనుము, నీకు అంతయు చెల్లింతునని'' చెప్పాడు (26వ.). ఇది హాస్యాస్పదమైన మాటయే, ఎందుకంటే - తన యజమానునికి చెల్లించే మార్గమేదీ అతనికి లేదు. అయినా అతనికి గత్యంతరం ఏమీ లేదు.

అప్పుడు యేసు ''క్షమాపణ'' - అనే రమ్యమైన ఈ ఉదాహరణ నిచ్చారు: ''ఆ దాసుని యజమానుడు కనికరపడి, వానిని విడిచిపెట్టి, వాని అప్పు క్షమించెను'' (27 వ.).

అయితే, యేసు ఈ కథను అప్పుడే ముగించలేదు. ''అయితే ఆ దాసుడు బయటకు వెళ్లి తనకు నూరు దేనారములు అచ్చియున్న తన తోడి దాసులలో ఒకనిని చూచి'' (28a వ.). 10,000,000 డాలర్లు అప్పు క్షమింపబడిన ఆ దాసుడు పండుగ చేసికోవాలను కున్నట్టున్నాడు. గనుక, తన యొద్ద డబ్బు లేనందున, తనకు నూరు దేనారాలు అచ్చి యున్న తన తోడి దాసుని వెదకడానికి నిర్ణయించుకున్నట్టున్నాడు. ఆ ముచ్చట అలా వుంచి, వానికి క్షమించే బుద్ధిలేదు గనుక అతడు క్షమాపణను

అనుభవించలేడు అనేది అక్కడ చర్చనీయాంశం.

ఒక సాధారణమైన కూలివానికి ఆ దినాల్లో యిచ్చే కూలి - ‘‘దేనారం’’. నూరు దేనారాల అప్పును డాలర్ల లెక్కలో నిశ్చయంగా చెప్పలేం. పనివారి భద్రతకు ‘‘కనీసపు వేతనం’’ అనే చట్టం ఆ రోజుల్లో ఏదీలేదు. అప్పటి కూలివారు పస్తుపడి యుండకుండేలా పొందే కూలియే అది. గనుక దాన్ని యిక్కడ మనం 18 డాలర్లను కుందాం. వాస్తవమైన మొత్తమెంత అనేది ప్రాముఖ్యం కాదు. ఇంతకు మన పాయింటేమంటే - తొలి మానవుడు క్షమింపబడిన దానితో పోల్చితే, యిది ఎన్నికలేనిది.

# క్షమాపణ క్షమింపబడిన వానికంటె క్షమించినవానికి ఎక్కువ (మేలు) చేస్తుంది

అదెలాగున్నా, 10, 000, 000, డాలర్ల అప్పు క్షమింపబడినవాడు చివరికి తన తోడి దాసుని కనుగొన్నాడు. వాడతనిని చూచినప్పుడు - ‘‘వాని గొంతుపట్టుకొని - నీవు అచ్చియున్నది చెల్లింపు మనెను’’ (28b వ.). ‘‘నా 18 డాలర్లు యివ్వు’’ అంటూ అతడు పెద్దగా కేక వేసేది నేను వినగలుగుతున్నా.

వెంటనే, ‘‘వాని తోడిదాసుడు సాగిలపడి - నా యెడల ఓర్చుకొనుము, నీకు చెల్లించెదనని వానిని వేడుకొనెను’’ (29వ.). కనికరం కొరకు రాజు యెదుట తాను మనవి చేసికొన్నప్పుడు అతడు ఉపయోగించిన మాటలు యివే, అవి అతని మనస్సులో గుండా దూరి, తన మనస్సాక్షిని మేల్కొలిపి యుండవలసింది. అయితే అవి అలా చేయలేదు. అతడు 10, 000, 000 డాలర్ల అప్పు క్షమింపబడ్డాడు, కాని అతడు 18 డాలర్ల అప్పును క్షమించడానికి యిష్టపడటం లేదు. తన 18 డాలర్లు పొందలేక పోయినందుకు అతడు మండిపడ్డాడు. అతడు పండుగ చేసికోలేకపోయాడు!

కోపోద్రేకంతో - ‘‘వాడు ఒప్పుకొనక అచ్చియున్నది చెల్లించువరకు వానిని చెరసాలలో వేయించెను’’ (30 వ.). చెరసాలలో ఉండే దినాల్లో అతడేమీ సంపాదించలేడు గనుక, క్షమించని ఆ దాసుడు వానిని, కొద్ది డాలర్ల కొరకు జీవితాంతం చెరసాల పాలుచేశాడు!

ఈ దాసుని చర్యలను తక్కిన దాసులు కనిపెట్టి చూచారు: ‘‘కాగా వాని తోడి దాసులు జరిగినది చూచి, మిక్కిలి దుఃఖపడి, వచ్చి, జరిగినదంతయు తమ యజమా

నునికి వివరముగా తెలిపిరి" (31వ.). రాజు కోపంతో మండిపడ్డాడు.

> అప్పుడు వాని యజమానుడు వానిని పిలిపించి - చెడ్డ దాసుడా, నీవు నన్ను వేడుకొంటివి గనుక నీ అప్పంతయు క్షమించితిని; నేను నిన్ను కరుణించిన ప్రకారము నీవును నీ తోడి దాసుని కరుణింపవలసి యుండెను గదా అని వానితో చెప్పెను. అందుచేత వాని యజమానుడు కోపపడి, తనకు అచ్చియున్నదంతయు చెల్లించువరకు బాధపరచు వారికి వాని నప్పగించెను (32-34 వచనాలు).

వాడు మరోసారి తన యజమానుని యొద్ద కనికరం కొరకు బతిమాలి యుంటాడు. అయితే అది ప్రయోజనం లేకుండా పోయింది. అతడు న్యాయం కావాలని కోరాడు గనుక, రాజు వానికి న్యాయమే జరిగించాడు! గుర్తింపబడని మార్గాల్లో వచ్చే డబ్బుగాని, ఎక్కడైనా దాచి పెట్టింది గాని బయటికి రప్పించడానికిగాను, ఋణ స్థులను కొన్నిసార్లు భయంకరంగా బాధించేవారికి అప్పగిస్తారు. ఇతనికి డబ్బు వచ్చే మార్గం యిక ఏదీ లేనందున నిత్యమూ బాధింపబడడానికే అతడప్పగింప బడినట్టున్నాడు - "నిత్య శిక్షకు యిది సూచనయై యుండవచ్చు".

"మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయ పూర్వకముగా క్షమింపని యెడల నా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీయెడల చేయును"(35వ.) అనే మాటలతో ఈ అంశాన్ని ముగిస్తున్నారు. క్షమించడమో, పోగొట్టు కొనడమో - మనకే అది అప్పగించబడింది. దేవుడు మనకు దయచేయ నుద్దేశించిన క్షమాపణను పోగొట్టుకొనడమా? ప్రభువు సహోదరుడైన యాకోబు యిలాటి కఠినమైన మాటలను దాఖలు చేశాడు: "కనికరము చూపని వాడు కనికరములేని తీర్పు పొందును, కనికరము తీర్పును మించి అతిశయపడును" (యాకోబు 2:13).

ఈ ఉపమానంలో నుండి అనేక గొప్ప పాఠాలు నేర్చుకోవచ్చు- ఒకటి, దేవుని కృపలేని మానవ నిస్సహాయస్థితి: 10,000,000 డాలర్ల అప్పున్న ఆ దాసుడు మనలో ప్రతి ఒక్కరిని సూచిస్తున్నాడు. ఆత్మసంబంధంగా, మనం ఎన్నడు చెల్లించలేనంతగా ఋణపడి యున్నాం (రోమా. 3:23). పాపానికి వచ్చే జీతం ఆత్మ సంబంధమైన మరణం (రోమా 6:23). దురదృష్టవశాత్తు "- నా యెడల ఓర్చు కొనుము, నీకు అంతయు చెల్లింతును" (26 వ.), అన్నవానివలె మనలో కొందరం ఉన్నాం. తమ శ్రేష్టమైన జీవితాలవలనగాని, లేక వారి మంచి క్రియలవలనగాని ప్రభువునకు తమ పాప ఋణం చెల్లించగలమని తలంచే కొందరున్నారు. "ప్రభువా, కొద్దిగా సమయం యివ్వండి; నేను అంతా చక్క బెట్టేస్తాను" అన్నట్టు! అయితే అలాటిది ఎన్నటెన్నటికి జరుగబోదని ఈ ఉపమానం తెలియ పరచింది. పదిలక్షల సంవత్సరాలకు కూడా అది సాధ్యమయ్యే పని కాదు. దేవుడు మనయెడల జరిగించినదానిని అభినందించడానికి గాను, ఈ సత్యాన్ని మనం గుర్తించాలి! ఏది ఎలాగున్నా, ఈ ఉపమానంలో ఉన్న ముఖ్యమైన పాఠమేమంటే - "క్షమింపబడాలంటే - క్షమించాలి" అనేదే. క్రొత్త

నిబంధన పేజీలలో ఏదైనా తేటగా బోధింప బడిందంటే- మనం క్షమించబడ్డాం గనుక, యితరులను క్షమించడానికి మనం ఎల్ల వేళలా సిద్ధపడియుండాలి. కొలస్సీ, ఎఫెసీలో ఉన్న సోదరులకు పౌలు ఈ మాటలు వ్రాస్తున్నాడు:

> సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీరు విసర్జించుడి. ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణా హృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరి నొకరు క్షమించుడి (ఎఫెసీ. 4:31-32).
>
> ఎవడైనను తనకు హాని చేసెనని యొకడనుకొనిన యెడల ఒకనినొకడు సహించుచు ఒకనినొకడు క్షమించుడి, ప్రభువు మిమ్మును క్షమించినలాగున మీరును క్షమించుడి (కొలస్సీ. 3:13).

## క్షమాపణ చర్చించబడింది

### క్షమించడమంటే - అర్థమేమిటి?

క్షమించడమంటే - అర్థమేమిటి? ''క్షమించి మరచిపో'' అని మనం అప్పుడప్పుడు బుద్ధి చెప్పబడుతూ ఉంటాం. అదెలాగున్నా మానవ మనస్సును చదివినవారు మనకేం చెప్పుతున్నారంటే - క్షమించి మరచి పోవడమనేది అక్షరార్థంగా అసాధ్యమట! మనం ఎప్పుడైనా చూచినా, విన్నా, అనుభవించినా అది మన మెదడులో ఎక్కడో అతుక్కు పోతుందట. ఇలాటిది వాస్తవానికి తప్పు కానవసరం లేదు. దేవుడు సహితం అక్షరార్థంగా ''క్షమించి మరిచిపోరు'' లేకుంటే - ఆదికాండం యొక్క రచనకు ముందు క్షమింపబడిన పాపాలుగల ఆ గ్రంథం మనకు లభించియుండేది కాదు. దైవ ప్రేరేపణవలన ఆ వివరాలన్నీ యివ్వకపోతే, మోషేకు వేల సంవత్సరాలకు ముందు జరిగిన పాపాల వివరాలు అతనికి తెలిసియుండేవి కావు, గనుక ఆ పాపాలలో కొన్ని అనేక సంవత్సరాలకు పూర్వమే క్షమింపబడినా, దేవుడు వాటిని "జ్ఞాపకముంచు కున్నారు". దేవుడు మన పాపాలు క్షమించి, వాటిని యికనెన్నటికిని జ్ఞాపకమందుంచు కొనననట్లు బైబిలు చెప్పినప్పుడు (యిర్మీయా 31:34; హెబ్రీ. 8:12) దాని భావమేమి? ఆ సమయంనుండి, ఆ పాపాలు జరుగనట్లు దేవుడు భావిస్తారు. ఒక రచయిత యిలా అన్నాడు:

> "మరచిపోవడం" - అనే దానికి బైబిలు భావమేమంటే - ''దానివలన యికను ఎన్నడు ప్రభావితం కాకుండడం, దాన్ని బయటికి కనుబరచకుండా ఉండడం'' అని. వారి దోషముల విషయమై దయగలిగి "వారి పాపములను వారి అక్రమములను ఇకను ఎన్నటికిని జ్ఞాపకము చేసికొనననని" ఆయన తెలియజేసినప్పుడు (హెబ్రీ. 10:17), ఆయన తేలిగ్గా మరచిపోయే ఓగైన జ్ఞాపకశక్తిగలవాడని దాని భావం కాదు. అలాటిది దేవునికి అసాధ్యం.

ఇందు విషయమై, దేవుడు తెలియ జేసేదేమంటే- నాతో వారికుండే బాంధవ్యంలో వారి పాపం మార్పు కలిగించదు, వారి పట్ల ఉన్న నా స్వభావాన్ని అది ప్రభావితం చేయదు, అంటే- పాపం యికను వారికి ఆరోపింపబడదు. అది వారి లెక్కలో చేర్చబడదు.[5]

మన ఎదుట ఉన్న సవ్వాలు : మనం అలా చేయనేర్చుకొనడమే.

గత సంవత్సరాల్లో కక్షలు పోగొట్టుకొనే విషయంలో జనులకు సహాయం చేయ ప్రయత్నించాను. మానవ హృదయంలో క్షమాపణ అనేది రెండు అంచలుగా జరుగుతున్నట్టు గ్రహించి అనేకులు మేలు పొందారు (ఇది నా పరిచర్యలో ఒక భాగంగా వినియోగించాను).

ఒక విధంగా, క్షమాపణ అనేది తక్షణమే జరుగుతుంది. మన పాఠ్యభాగంలో యిలాటి క్షమాపణ నొక్కి చెప్పబడింది. స్వల్పకాలపు క్షమాపణతో సంబంధం కలిగియున్న స్వభావ లక్షణాలు వగైరాలను గూర్చి - రోమా 12:18-21 తెలుపుతుంది.

శక్యమైతే మీ చేతనైనంత మట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి. ప్రియులారా, మీకు మీరే పగ తీర్చుకొనక, దేవుని ఉగ్రతకు చోటియ్యుడి-పగతీర్చుకొనుట నా పని, నేనే ప్రతిఫలము నిత్తును - అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడి యున్నది. కాబట్టి, నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము; అలాగు చేయుటవలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడువలన జయింపబడక, మేలు చేత కీడును జయించుము.

రోమా12లోని ఈ వచనాల్లోనుండి యిలాటి తీర్మానాలు చేయవచ్చు:

(1) ఇతరులను మనం క్షమించినప్పుడు దేవుడు జరిగించినట్టు మనం చేయడానికి ప్రయత్నం చేస్తాం. అంటే జరిగిన కొన్ని సంఘటనలు జరుగనట్టు భావిస్తాం. ఈ సూత్రానికి సంబంధించి వాస్తవమైన మినహాయింపులు కొన్నీ[6]; బైబిలు సంబంధమైన మినహాయింపులు కొన్నీ ఎదురౌతాయి. ఏది ఎలాగున్నా, మనకు శక్యమైనంత వరకు "గతం" అనేది నేటి బాంధవ్యాలను బాధింపకుండ చూచుకోవాలి. ఆ వ్యక్తులకు మనం దూరంగా తొలిగి పోకుండ ఉండాలి. అంటే, వారితో మాట్లాడ నిరాకరింప కూడదు. మన బాంధవ్యంలోనికి గతాన్ని తేకుండేలా తీర్మానించుకోవాలి. శక్యమైతే అందరితో సమాధానంగా ఉండ ప్రయత్నించాలి.

(2) మనలను బాధించిన వారిని క్షమించినప్పుడు, పగతీర్చుకోవాలనే భావనను వదులుకోవాలి. ఇతరులతో వారిని గూర్చి మాట్లాడే విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. మనలను బాధించిన వారిమీదికి "తిరిగి వెళ్లే" ప్రయత్నం చేయకుండాలి. అలాటి విషయాలను దేవునికి అప్పగించాలేగాని, ఎన్నడూ నీవు పగ తీర్చుకోజూడవద్దు. ఎందుకంటే - "పగ తీర్చుకొనుట నా పని నేనే ప్రతిఫలమిత్తునని ప్రభువు చెప్పు చున్నాడు."

(3) ఇతరులను క్షమించినప్పుడు - మనం శ్రేష్ఠమైన దాన్ని వెదుకుతున్నాం, మనం క్షమించినవారి మేలునూ కోరుతున్నాం. దేవుని ప్రేమయొక్క ప్రాముఖ్యమైన భాగమిదే! ఇది సకల మనుష్యులకునూ అందించబడాలి. "నీ శత్రువు ఆకలి గొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే, దాహమిమ్ము".

(4) మనం యితరులను క్షమించినప్పుడు, మన హృదయాల్లో నుండి వారి విషయమై, సమస్త విధములైన కక్షను, శత్రుత్వాన్ని రూపుమాపాలి. "కీడువలన జయింపబడక మేలు చేత కీడును జయించుము" అని వ్రాయబడియుంది.

ఈ చివరి ఆలోచన దీర్ఘకాల క్షమాపణను తెస్తుంది. వెంటనే మనం ఒకరిని క్షమించినా, మనలను బాధించిన వారిని గూర్చిన దురాలోచనలతో మనం పోరాడుతునే ఉండవచ్చు. వారు సమీపానికి వచ్చినప్పుడు, మనం స్వేచ్ఛలేనట్టుగా భావించుతూ ఉండవచ్చు. గనుక దీర్ఘకాలం ఉండే క్షమాపణ, దీర్ఘంగా వేయబడిన పద్ధతిగా ఉండవచ్చు. అంటే, దీనికి చాలా సంవత్సరాలు పట్టవచ్చు; అది జీవితకాలమంతా పట్టవచ్చు!

దీర్ఘకాల క్షమాపణకు రెండు బీగాలున్నాయి. మొదటిది: దాని విషయమై పనిచేయడం మనం మానకుండేలా తీర్మానించుకోవాలి. ఏమీ జరుగలేదు అనే భావన క్షమింపబడినవాని పట్ల కలిగి, దాన్ని కొనసాగించుకోవాలి. మన అంతరంగపు తలంపుల విషయంలో, మనం మానక పని చేయాలి. ఇది కష్టమని తోచవచ్చు, కాని కాలం మన గాయాలను మాన్పగలదు.

రెండోబీగం: ఎక్కువ సమయాన్ని ప్రార్థనలో గడపడం. మనకు సహాయం చేయునట్లు దేవునికి మానక ప్రార్థన చేయాలి. దేవునికి సమస్తం సాధ్యమనే విషయాన్ని జ్ఞాపకముందుంచుకోవాలి (మత్తయి 19:26). యేసు-"తండ్రీ, వీరేమిచేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము" అని సిలువలో యేసు ప్రార్థించినట్టు, మనకు హానిచేసిన వారి విషయంలో మనం ప్రార్థించాలి (లూకా 23:34). ఒక వ్యక్తిని గూర్చి నిరంతరం ప్రార్థనచేస్తూ, అతనిమీద (పగ) మనస్తాపం ఉంచుకొనడం కష్టం.

దీర్ఘకాల క్షమాపణ మన హృదయాల్లో వృద్ధిపొందుతున్నప్పుడు, కష్టం కలిగించిన సంఘటనలు మన తలంపులను వశపరచుకోకుండ అంతరిస్తాయ్; మన జ్ఞాపకాల్లో నుండి అవి తుడిచివేయబడతాయి. జరిగిన సంభవాలను ఎలాటి బాధలేకుండా జ్ఞాపకంచేసికో గలిగినప్పుడే క్షమాపణా కార్యక్రమం సంపూర్తియౌతుంది. ఈలాటి స్థితికి ఈ జీవిత కాలంలో చేరుకోవచ్చు, లేకపోవచ్చు. మనం ఆ స్థితికి చేరుకో గలిగామంటే మాత్రం అది గొప్ప అనుభూతియే! మన క్రైస్తవ జీవితంలో అలాటి నూతన పరిపక్వానికి చేరేలా సహాయం చేసినందుకు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుదాం.

**క్షమాపణ మనకేమి చేస్తుంది?**

క్షమించడాన్ని మనం అలవరచుకొంటే, క్షమింపబడిన వానికంటే, క్షమించుతున్న మనకు అది ఎక్కువ మేలు కలిగించుతున్నట్టు కనుగొనగలం. మనం క్షమించకపోతే, మన హృదయాల్లో కక్ష పెరుగుతుంది. ఇలాటి లోపానికి విరోధంగా హెబ్రీ. 12:15 యిలా హెచ్చరిస్తుంది: ''మీలో ఎవడైనను దేవుని కృపను పొందకుండ తప్పిపోవునేమో అనియు, చేదైన వేరు ఏదైనను మొలచి కలవరపరచుటవలన అనేకులు అపవిత్రులై పోవుదురేమో అనియు ... జాగ్రత్తగా చూచుకొనుడి.''

తిరిగి క్షమాపణ మనలను స్వతంత్రులనుగా చేస్తుంది. పగలు మన తలంపులను నింపుతూ, రాత్రులందు నిద్ర పట్టనియ్యకుండ చేసేది శత్రుత్వమే! మన ఆత్మలను తినివేసేలా దాన్ని వదలినట్లయితే, అదే మన జీవితాలను వశపరచుకొంటుంది. ఆ పరిస్థితిని స్వాధీనపరచుకోకుండ వదలితే, అది మనలను పాడుచేసేలా విడిచిపెట్టా మన్నట్టే, కక్షను మనస్సులో నిలుపుకొన్నామంటే, అది యితరులను బాధించదు సుమా; మనలనే బాధిస్తుంది. అయితే మనలను బాధించినవారిని క్షమించినప్పుడు, ద్వేషమనే భారం విసరివేయబడుతుంది, దురభిప్రాయం (కోపం) దూరపరచ బడుతుంది. నెమ్మదిగా జీవితాన్ని కొనసాగించేలా అది మనలను విడుదల చేస్తుంది. అంటే ''క్షమాపణ'' మనస్సును ఒత్తిడి నుండి విడుదల చేస్తుందన్నమాట.

తాను మనలను క్షమించిన ప్రకారం క్షమించండంటూ ప్రభువైన యేసు ఆజ్ఞాపించడంలో వింతలేదు. ఎందుకంటే - ''క్షమాపణ'' అనేది ఆత్మ సంబంధంగాను, ఉద్వేగంగాను, దేహసంబంధంగాను మనకు సహాయపడుతంది. ఈ సందర్భంగా ఒక రచయిత యిలా అన్నాడు:

> ఒకరినొకరు క్షమించుకొండని మనకాజ్ఞాపించిన దేవుడు, చట్ట సంబంధమైన యొక విధినో లేక సమాధానాన్ని నెలకొల్పే ఒక సూత్రాన్నో - యియ్యలేదు. కాని మనమేలుకొరకే ఆయన అలా ఆజ్ఞాపించారు. ద్వేషం, కోపం అనే వాటిని మనస్సులో నిలుపు కొనడమనేది మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నట్టు రుజువుచేయబడింది. ఆస్తిని పొంది, దాన్ని నిలబెట్టు కొనడం అనే ప్రాముఖ్యమైన బాంధవ్యానికినీ, బిడ్డలను పెంచడానికినీ, ఉద్యోగం నిలుపుకొనడానికినీ, అది ఆటంకంగా ఉంటుంది. అది ఆనందాన్ని ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది. (ఎందుకంటే) ఆనందం, ఆరోగ్యమనేవి, కోపం, ద్వేషం అనేవాటితో కలసి ఉండలేవు. మరోవైపు, నిజమైన క్షమాపణ గొప్ప సంతోషం,సంతుష్టి అనే దేవుని నిత్యవాగ్దానాలను వెంబడిస్తుంది. అది నిరాటంకంగా పార్లి పారే సమాధానం, సంతోషం, ఐక్యతయై యుంటుంది (క్షమాపణ యిలాటి ఆశ్చర్యకరమైన కార్యాలను చేస్తుంది).

## ముగింపు

ఈ పాఠాన్ని ఎంత ఆచరణ యోగ్యంగా చేయగలమో, అంతగా చేద్దాం; దేవుడు నిన్ను క్షమించమని కోరింది ఎవరిని? గతంలో నిన్నెవరైనా బాధించారా? ఆ వ్యక్తిపైన

నీవు యింకా చెడ్డ తలంపులను నిలుపుకొని యున్నావా? నీ హృదయంలో అతని క్షమించావా? నీవు అతన్ని క్షమించియుంటే, గతంలో జరిగిన అపరాధం మీమధ్య నేటి సంబంధాన్ని బాధింపకుండేలా పూర్ణంగా ప్రయత్నిస్తున్నావా? నీ స్వభావం మీద కృషిని కొనసాగిస్తున్నావా? నిన్ను బాధించిన వానికొరకు అనుదినం ప్రార్థిస్తున్నావా? (క్షమాబుద్ధి నీలో సజీవంగా ఉందా?)

ఒకవేళ క్షమాపణ కాకుండ కక్షయే నీ హృదయంలో ఉన్నట్టు కనబడితే, ఆ వ్యక్తిని క్షమించే మార్గం కొరకు ప్రార్థించు. ఈ పాఠ్యాంశంనుండి రెండు ముఖ్యమైన పాఠాలు నేర్చుకో; 1. మనం 10,000,000 డాలర్ల నేరం క్షమింపబడినవారమని గుర్తుంచుకొని, 18 డాలర్ల తప్పును క్షమించడానికి సిద్ధంగా ఉండాలి. 2. మనం క్షమించనట్టయితే, మనం క్షమించబడం. గనుక క్షమించుటకు దేవుడు మనకు సహాయము చేయును గాక!

---

## సువార్తికులకు ఉపదేశకులకు సూచన

నీవు క్లాసులో ఈ పాఠాన్ని వినియోగించినట్లయితే, 18లో ప్రభువైన యేసు క్షమాపణను గూర్చి చెప్పిన దానితో దీన్ని (నీకు కావాలను కొంటే) ముడివేయవచ్చు. 21నుండి 35వరకు ఉన్న సందేశం - త్రోవతప్పిన క్రైస్తవుని సరియైన దారికి నడిపించకూడదని దీని భావం కాదు; లేదా అవసరమైతే క్రమశిక్షణ చేయకూడదని కాదు (15-21). అయితే 1. సంఘ క్రమశిక్షణ వ్యక్తిగతమైన పగను సాధించడానికి ఎన్నడూ ఉపయోగింపకూడదు. 2. క్రమ శిక్షణ చేయబడిన వ్యక్తిపై విరోధ భావాన్ని నిలుపుకోకూడదు. 3. సంఘంలో ప్రేమ, క్షమాపణా స్వభావమే తాండవించాలని ఆ వచనాలు బోధిస్తున్నాయి.

ఈ పాఠంలో, "నేను మారుమనస్సు పొందానని చెప్పని (అంటే, క్షమాపణ కోరని) వ్యక్తిని మనం నిజంగా క్షమించగలమా?" అని, తరచుగా చర్చించబడే అంశం వైపుకు మళ్లిపోకుండా, నేను జాగ్రత్తపడ్డాను! లూకా 17:4లో ప్రభువైన యేసు చెప్పిన మాటల మీద ఈ చర్చ ఆధారపడింది. ఒకడు మారుమనస్సు పొందేవరకు దేవుడు వానిని క్షమించడు గనుక, తాను మారుమనస్సు పొందేవరకు క్షమించాలని దేవుడు మనలను ఎదురుచూడదు (అనేది కొందరి భావన). ఇలాటి చర్చలో, నాకున్న సమస్య ఏమంటే; నేను దేవుడనుకాను. "నేను మారుమనస్సు పొందానని" ఒకడు అంటే, తాను పొందాడో లేదో నాకు తెలియదు. ఒకవేళ అతడు నన్ను క్షమాపణ కోరాడంటే, తాను యథార్థంగా అన్నాడో లేదో కూడా తెలిసికొనే మార్గం నాకు లేనేలేదు. వాస్తవంగా, ఒకడు ఒక రోజులోనే ఏడు మారులు నన్ను బాధించియుండి (లూకా 17:4), ప్రతిసారి అతడు "నన్ను క్షమించు" అని అన్నాడనుకో, నేను వాని యథార్థతను

సందేహిస్తాను. మరో విధంగా చెప్పాలంటే, మనిషియొక్క మారు మనస్సును గూర్చి ప్రభువైన యేసు అక్కడ నొక్కి చెప్పినదానికంటే, క్షమించడానికి ఒకడు ఎలా సంసిద్ధుడైయుండాలో అనే దాన్ని గూర్చి ఆయన నొక్కి చెప్పారని నేను భావిస్తున్నా.

నేను హృదయపు స్థితిని గూర్చి ఎక్కువ శ్రద్ధకలిగియున్నాను గనుక మామూలుగా చేసే ''క్షమాపణ ప్రసంగం'' చేయడానికి మనస్సులేనివాడనై ఆ చర్చను యిక్కడ మాని వేశాను. ''క్షమించని దాసుని'' గూర్చిన ఉపమానాన్ని ప్రభువైన యేసు ఈ మాటలతో ముగిస్తున్నారు: ''మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయ పూర్వకముగా క్షమింపనియెడల నా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీ యెడల చేయును'' పైగా, యేసు - ''తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము'' అని ప్రార్థించారు (లూకా 23:34). తన్ను సిలువ వేసినవారి పాపాలు అప్పటికప్పుడే క్షమించబడినట్టు ఆయన మాటలు సూచించడం లేదు. యూదులు ఆ దోషం చేసినట్టు ఏభై దినాల తరువాత పేతురు తిరిగి నేరస్థాపన చేశాడు (అపొ. 2:23). అయితే - (తన్ను హింసించిన వారిపట్ల) తన హృదయం కక్షతో నింపబడ లేదన్నట్టు ప్రభువు యొక్క మాటలు సూచిస్తున్నాయి (ఆయన వారిపై పగ పెట్టు కోలేదంటానికి ఆ మాటలే రుజువుగా ఉన్నాయి).

''మారుమనస్సు పొందకుంటే క్షమించవచ్చా?'' అనే చర్చను నేను ఎప్పుడు చదివినాసరే - మనం ఒకని మామూలుగా క్షమించామా లేదా అనే దానికి రుజువుగా క్రోధాన్ని యింకా హృదయాల్లో నిలుపుకోకూడదు, కక్షలు ఉంచుకోకూడదనే వాటిని రచయిత నొక్కి పలికాడో లేదో తనిఖీ చేస్తాను. ఆ పాయింటును అతడు నొక్కి చెప్పినట్టయితే అతనితో నాకు ఏ అనంగీకారం లేదు.

---

సూచనలు

[1] Eldred Echols, *Discovering the Pearl of Great Price* (Fort Worth, Tex.: Sweet Publishing Co., 1992), 43.

[2] రబ్బీలు తమ బోధను ఆమోసు 1, 2ల మీద ఆధారం చేసికొంటారు. వారి ఆలోచన ఏమంటే - ఆయా దేశాలవారు మూడుసార్లు చేసిన పాపాలను దేవుడు క్షమించారు. నాల్గవమారు చేసిన పాపానికి ఆయన తన ఉగ్రతను కుమ్మరించారు. గనుక మహోన్నతుడు అంతకంటె నరుల యొద్దనుండి ఎక్కువగా ఎదురుచూడరని వారు భావించినట్టున్నారు.

[3] ''డెభై ఏళ్లమారులు'' అనే దాన్ని కొన్ని ప్రాచీన ప్రతులు ''డెభై ప్లస్ ఏడు'' అని సూచించాయి (NIVని చూడు). ఆదికాండం 4:24 కూడా యిలాటి పదాన్నే ప్రయోగించింది. సిసలైన సంఖ్య ప్రాముఖ్యమయింది కాదు. ప్రభువైన యేసు అక్కడ అతిశయోక్తి సంఖ్యను ఉపయోగించారు. గనుక ఒక వేళ అది - డెభై ఏడేకాని, లేదా నాలుగు వందల తొంభైయ్యేకాని - మన క్షమాపణకు హద్దులుండకూడదని బోధించడానికే ఆయన అలా ఉపయో గించారు.

[4] తలాంతు విలువను గూర్చి పాలస్తీనా అంతటిలో సరాసరికి విధింపబడే శిస్తుయావత్తు ఎనిమిది వందల తలాంతులట. ఒక తలాంతును సంపాదించడానికి మామూలు పనివాడు ఇర్వై సంవత్సరాలు కష్టపడి పనిచేయవలసి వస్తుందట. 1 దినవృత్తాంతాలు 29:4-7లో, దావీదును అతని అధిపతులును దేవాలయ నిర్మాణం కొరకు కానుకగా యిచ్చిందంతా చేరి, రెండంతల కంటె కొంచెం అధికంగా ఉంటుందట. ఈ పదివేల తలాంతుల విలువను కొందరు

నేటి లెక్కల ప్రకారం ''లక్ష కోట్ల డాలర్లు'' - అయినట్టు అంచనా వేస్తున్నారు.

(తెలుగు బైబిల్ ఫూట్ నోట్‌లో - తలాంతంటే -3,600 రూపాయలు కావచ్చునని వ్రాయబడింది. పదివేల తలాంతులంటే 3,600 ౨10,000 =36,000,000 - అంటే మూడు కోట్ల అరవై లక్షల రూపాయలు. ''దేనారం'' అంటే - అర్ధ రూపాయి. నూరు దేనారాలు 1/2 X 100=50 రూపాయలు).

[5] Warren W. Wiersbe, *The Bible Expository Commentary*, vol. 2 (Wheaton, Ill.: Victor Books, 1989), 89.

[6] నీ దగ్గర దొంగతనం చేసినవాడిని నీవు క్షమించినా, వెంటనే వానిని - నీ ఆర్థిక వనరులపై బాధ్యునిగా చేయవని సామాన్యజ్ఞానం చెప్పుతుంది. నీ బిడ్డను నీచంగా తిట్టిన స్త్రీని నీవు క్షమించినా, వెంటనే నీ బిడ్డను ఎత్తుకునే పనికి ఆమెను పెట్టుకోవు, కదూ?